క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంగర బ్రహ్మోత్సవ పూజల్లో భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి అష్టమ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కుంచపూడి బాలబాలాజీ, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు పర్యవేక్షణలోని వేద పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు. తిరుమంజన సేవ, విశ్వక్సేనపూజ, అగ్ని ప్రతిష్ఠ, మూల మూర్తుల హోమం, బలిహరణ పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రవణా నక్షత్ర పూజల నేపథ్యంలో దాతలు దాసర దక్షిణామూర్తి, పత్తి వీరవెంకట సత్తిరాజు, సలాది ప్రదీప్ కుమార్, కరాటపు వెంకటేశ్వరరావు, మోటిపల్లి వీరవెంకట సత్యనారాయణమూర్తి, కొరిపెళ్ళ నాగేశ్వరరావు, గుణ్ణం సత్య, సూరంపూడి వెంకట్రావు, ఏకుల సాంబశివ వరప్రసాద్ దంపతులు 9 వెండి కలశాలు బహూకరించారు.

అయోడిన్ రుగ్మతపై అవగాహన అవసరం



కపిలేశ్వరపురం పాఠశాల విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: మానవ శరీరంలో అయోడిన్ రుగ్మతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పీఎన్ ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మతల సర్వేలైన్స్, ఆరోగ్యపు తనిఖీ కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అయోడిన్ శాతంపై అవగాహన కల్పించారు. స్థానిక కోరాటివారి ప్రాథమిక పాఠశాల, దేవీ సెంటర్ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల్లో అయోడిన్ ప్రభావంపై పరీక్షించారు. పిల్లల్లో అయోడిన్‌లోపం గుర్తించేందుకు 90 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ సురేష్ వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్రం మాజీ అధ్యక్షుడు నల్లబ్బులు మృతి

కపిలేశ్వరపురం: 1989–94 మధ్యకాలంలో మండలంలోని అంగర పాల సేకరణ కేంద్రం మాజీ అధ్యక్షుడుగా పనిచేసిన సంకాబత్తుల కృష్ణమూర్తి,(నల్లబ్బులు) (68) మంగళవారం అంగరలో అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ (చిన్నా) వైఎస్సార్ సీపీలో పనిచేస్తుండగా చిన్న కుమారుడు సత్తిబాబు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్‌గా సేవలందిస్తున్నారు. నల్లబ్బులు మృతికి గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు



గొల్లవిల్లి సుబ్బారావు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకుల పాలెంకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి గొల్లవిల్లి సుబ్బారావు (82) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారావు మృతితో ఆయన నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, ఆ కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు ప్రతినిధులు రవికుమార్, రామ్‌కుమార్‌లు కార్నియాలను సేకరించి భద్రపరిచారు. సౌమ్యుడిగా పేరొందిన సుబ్బారావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పేదల వైద్యుడు పచ్చిగోళ్ల కన్నుమూత



డాక్టర్ సత్యనారాయణ మూర్తి (ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు పచ్చిగోళ్ల సత్యనారాయణ మూర్తి (87) తన స్వగృహంలో అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. 1960 నుంచి 1990 వరకూ 30 ఏళ్ల పాటు డాక్టర్ సత్యనారాయణమూర్తి పట్టణంలో వైద్య సేవలు అందించారు. అప్పట్లో ఆయన పేదలకు ఉచిత వైద్యం అందించి పేదల వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. డాక్టర్ సత్యనారాయణమూర్తి మృతి పట్ల పట్టణంలోని ప్రముఖులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదు
- చైర్‌పర్సన్ దుర్గారాణి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



సమావేశంలో ప్రతిపక్ష సభ్యులకు జవాబిస్తున్న కోఆప్షన్ సభ్యుడు రాజుబాబు

మండపేట: గత ప్రభుత్వంలోనే టిడ్కో ప్లాట్లు పూర్తయితే అప్పట్లోనే లబ్ధిదారులకు వాటిపి ఎందుకు అప్పగించలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ప్రశ్నించారు. అసంపూర్తి పనులన్నీ పూర్తి చేసి లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగిస్తున్నామన్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించబోమని ప్రతిపక్ష సభ్యులకు హితవుపలికారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ దుర్గారాణి అధ్యక్షతన మంగళవారం స్థానిక కౌన్సిల్‌హాలులో నిర్వహించారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలోని అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడుతూ టిడ్కో ప్లాట్ల వద్ద అసంపూర్తి పనులతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ హయాంలోనే 95 శాతం పనులు పూర్తయ్యాయని, వైఎస్సార్ ప్రభుత్వం వచ్చి మూడున్నరేళ్లయినా మిగిలిన పనులు ఇంకా పూర్తిచేయలేదన్నారు. ఈ దశలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడూతూ ప్రతిపక్ష సభ్యులు వాస్తవాలు మాట్లాడితే సమంజసంగా ఉంటుందని చురలకలంటించారు. నాలుగు గోడలు నిర్మిస్తే ఇల్లు పూర్తవదని, అక్కడ నివాస యోగ్యంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్, సెప్టిక్‌ట్యాంకులు తదితర ఏ పనులు పూర్తిచేయకుండా ఎన్నికల ముందు లబ్ధిదారులను మభ్యపెట్టేందుకు గతంలో హడావిడిగా గృహప్రవేశాలు చేయించారని మండిపడ్డారు. పనులు పూర్తి చేసి ఇప్పటికే రెండు వేల మంది లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించామని, మిగిలిన వారికి త్వరితగతిన ప్లాట్లు అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో టీడీపీ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన పనులను ప్రస్తుతం శరవేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు ప్రభుత్వం ప్లాట్లు అప్పగిస్తోందన్నారు. పేదల సొంతింటి కల సాకానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో సచివాలయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సొంత భవనాల నిర్మాణంపై చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్ తెలిపారు.

నేత్రపర్వంగా జనార్దనస్వామి కల్యాణం



వెదురుపాకలో జనార్దనస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత జనార్దన స్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మాఘ శుద్ధ దశమిని పురస్కరించుకుని అంగర సూర్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో అంగర జనార్దనాచార్యులు, చక్రపాణి ఆచార్యులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెదురుపాక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మేజర్ డ్రైన్ల ప్రక్షాళనకు చర్యలు

- కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ శ్రీదేవి
- 11 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలోమాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పురపాలక పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే మేజర్ డ్రైన్ల ప్రక్షాళనకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో మంగళవారం చైర్‌పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 11 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యులకు సీనియర్ అసిస్టెంట్ కె.వేణు గోపాలరావు చదివి వినిపించారు. ఈ సందర్భంగా 6వ అంశంగా మేజర్ డ్రైన్ల పూడిక తీయాల్సిన అవసరంపై ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై కౌన్సిలర్లతో చైర్‌పర్సన్ చర్చించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పురపాలక పరిధిలోని మేజర్ డ్రైన్లను పూడిక తీయాల్సిన అవసరం ఉందన్నారు. పూర్తి సిల్ట్ నిండుకుని ఉండటంతో నీరు పారుదల లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిని ప్రక్షాళన చేసేందుకు ఇంజినీరింగ్ విభాగం అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన రహదారిని అనుకుని ఉన్న డ్రైన్లలో అత్యధికంగా పూడిక ఉందని దీనిని తీసి వేసేందుకు పొక్లెయిన్, ట్రాక్టర్లను వినియోగించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పూడిక తీయకపోతే రానున్న వర్షాకాలంలో డ్రైన్లు పూడుకుపోయి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. వీఎస్ఎం కాలేజీ నుంచి వెల్ల వంతెన వరకు, రాజగోపాల్ సెంటర్ నుంచి ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు ఇరువైపులా పూడిక తీయాల్సి ఉందన్నారు. మున్సిపాలిటీ సాధారణ నిధులతో చేపట్టే ఈ పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసేందుకు ఉద్దేశించిన ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఉత్తర్వులను కౌన్సిల్ సభ్యులకు సమర్పించారు. ఈ మేరకు ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు కౌన్సిలర్లు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. వీటితో పాటుగా అజెండాలోని మిగిలిన అంశాలకు కూడా సభ్యులు ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు వాడ్రేవు సాయిప్రసాద్, కుడిపూడి లలిత, కేతా శ్రీను, కట్టా శ్రీరాములు, మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మంచి రోజులొచ్చాయి



రాయవరంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ అనంతరం విద్యార్థులతో జెడ్పీటీసీ, ఎంపీపీ



ద్వారపూడిలో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ శేషారావు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో విద్యారంగానికి మంచి రోజులొచ్చాయని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారువెంకటరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసు, ఎంఈవో వై.సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 265 మంది తెలుగు, 294 మంది ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీవీఎస్ చౌదరి, పీఎస్ఎన్‌రెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి, సప్పా శ్రీనివాస్, గరగ సీతాదేవి, రామారావు పాల్గొన్నారు.

పేదల విద్యకు అధిక ప్రాధాన్యత

మండపేట: పేదల విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని ద్వారపూడి సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు పేర్కొన్నారు. గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు విద్యాభారతి స్టడీమెటీరియల్‌ను మంగళవారం వారు పంపిణీ చేశారు. సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ శేషారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పోతుల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపల్లి ప్రసాద్, సలాది గౌరినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంకల్ప దీక్షను జయప్రదం చేయండి

రామచంద్రపురం: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న కృష్ణా జిల్లా గన్నవరం సమీపాన సుందరయ్య విద్యానగర్‌లోని ధర్మస్థలి ప్రాంగణంలో జరిగే సంకల్పదీక్షను జయప్రదం చేయాలని యూటీఎఫ్ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పీఎస్‌వీ రమణ పిలుపునిచ్చారు. ఈమేరకు దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను పట్టణంలోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. పాత పెన్షన్ సాధనకై జరుగుతున్న ఈ దీక్షలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ నమోదు పరిశీలన



బాలాంత్రంలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కె.గంగవరం: మండలంలోని బాలాంత్రంలో రామచంద్రపురం ఆర్డీఓ పి. సింధు సుబ్రహ్మణ్యం మంగళవారం పర్యటించారు. జగనన్న సంపూర్ణ భూహక్కు పథకంలో లబ్ధిదారుల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సంపూర్ణ భూహక్కు పథకం విషయంలో బాలాంత్రం గ్రామం వెనుకబడి ఉందన్నారు. ప్రభుత్వం మంచి సంకల్పంతో అమలు చేస్తున్న ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా, లబ్ధిదారులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు.

యుద్ధప్రాతిపదికన పూడిక తొలగించాలి



సమస్యపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు

మండపేట: సాగునీటికి ఆటంకం లేకుండా రామచంద్రుడు పంటకాలువలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రామచంద్రుడు పంట కాలువలో పూడిక పేరుకుపోయి పొలాలకు నీరందక నెరలు తీస్తుండటంతో రైతులు శ్రమదానం చేసిన విషయం విదితమే. పట్టణ సమీపంలో గాజుసీసాలు, జంతువుల మృత కళేబరాలతో కాలువలో దిగేందుకు వీలులేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు ఇరిగేషన్ ఈఈ విజయగోపాల్, డీఈ రామకృష్ణతో కలిసి కాలువను పరిశీలించారు. సమస్యపై రైతులతో మాట్లాడారు. పట్టణ పరిధిలో మున్సిపల్ నిధులతో పూడికతీత పనులు నిర్వహిస్తామని చైర్‌పర్సన్ దుర్గారాణి తెలిపారు. పట్టణ వెలుపల ఇరిగేషన్ ఆధ్వర్యంలో పూడిక తొలగింపు పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడకుండా బుధవారం నుంచి పనులు చేపట్టాలని చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు అధికారులకు సూచించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, ఏఈ నాగరాజు, వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, పిల్లి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వాణీకుమారికి స్పందన సేవా పురస్కారం

మండపేట: స్పందన సేవా పురస్కారాన్ని అందుకున్న గౌతమి మున్సిపల్ హైస్కూల్ టీచర్ ఎంకేపీ వాణికుమారిని మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అభినందించారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత అభ్యున్నతికి చేస్తున్న కృషికి ఈ అవార్డు అందుకున్నట్టు వాణికుమారి తెలిపారు. వాణికుమారిని ఎమ్మెల్సీ తోట సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పి.దుర్గారాణి, కపిలేశ్వరపురం జెడ్పీటీసీ పి.అబ్బు, పోస్టల్ ఉద్యోగసంఘం నాయకుడు కొండపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత విద్య ప్రారంభించాలని సర్వమత ప్రార్థనలు



సర్వమత ప్రార్థనలు చేస్తున్న పూర్వ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీవీఆర్ హైస్కూల్‌లో ఉచిత విద్యను తిరిగి ప్రారంభించాలని కోరుతూ మంగళవారం సాధన సమితి అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు నేతృత్వంలో బోసుబొమ్మ సెంటర్‌లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో యాజమాన్యం మనస్సు మార్చాలని కోరుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవ ప్రార్థనలు చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్యమతస్తుల షాపులు లేకుండా చూడండి

అమలాపురం రూరల్: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి తీర్థంలో అన్యమతస్తుల షాపులు లేకుండా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలసి వినతిపత్రం అందించారు. అన్యమతస్తులు మతమార్పిడి కోసం కరపత్రాలు పంచడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిసిందని, అరికట్టాలని కోరారు. ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి దూరి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వర్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు.

పేదల జీవనోపాధికి 'జగనన్న చేదోడు'



ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు

మండపేట: వృత్తి పనిచేసుకునే పేదవర్గాల వారి జీవనోపాధికి జగనన్న చేదోడు పథకం తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తమ జీవితాల్లో వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేస్తూ మండపేట మండలానికి చెందిన నాయీ బ్రాహ్మణులు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వసాయాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని వారికి సూచించారు. వై సీతానగరం ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యురాలు అడ్డూరి శ్రీదేవి, వేగిరాజు సురేష్, సిలారపు శ్రీను, సిలారపు రవి దుర్గాప్రసాద్, పట్నాల భాస్కర్, కింతాడ ఆనంద్, మల్లెవలస బంగార్రాజు, పొన్నాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



బ్రహ్మంగారిమటం సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న మలుపు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం ఆర్యావటం వద్ద ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ముఖ్యంగా దొరగారి మకాం, బ్రహ్మంగారి మటం సెంటర్లలో ×జెడ్‌ఞ ఆకారంలో ఉన్న మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేవరకు ఒకదానికి ఒకటి కనిపించకపోవడంతో ఢీకొని ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నారు. ఈ మలుపులకు ఇరువైపులా స్పీడ్‌బ్రేకర్లు కాని, హెచ్చరిక బోర్డులు కాని లేకపోవడంతో ప్రమాదాలు మరింత ఎక్కువతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి మలుపులో స్పీడ్‌బ్రేకర్లు ప్రయాణికులకు స్పష్టంగా కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాగం పోలరాజు, బండి అబ్బు, చందాల బాబులు, కోట వీవీ సత్యనారాయణ, స్థానికులు కోరుతున్నారు.

రైల్వే భూముల పరిశీలన



కోటిపల్లిలో రైల్వే భూములను పరిశీలిస్తున్న జేసీ ధ్యానచంద్ర

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలోని రైల్వే భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని కోట నుంచి కోటిపల్లి వరకు ఉన్న రైల్వే భూముల రికార్డులను, భూములను పరిశీలించి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంగరలో పశు వైద్య సంచార వాహనం ప్రారంభం



పశువైద్య సంచార కేంద్ర వాహనం

కపిలేశ్వరపురం: మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం 108 అంబులెన్స్ తరహాలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార పశు వైద్యశాలలను బుధవారం అంగరలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించనున్నట్టు మండల పశువైద్యాధికారిణి సీహెచ్.ఇందుప్రియ మంగళవారం తెలిపారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు 1962 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదిస్తే రైతుల ముంగిటకే వాహనంలో వచ్చి వైద్య సేవలందిస్తారు. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పేరుతో ఇటీవల ప్రభుత్వం మండపేట నియోజకవర్గానికి కేటాయించిన వాహనం కపిలేశ్వరపురం మండల పరిధిలో వైద్య సేవలందించనున్నట్టు అంగర పశువైద్యాధికారి రమణ మూర్తి తెలిపారు.

ఉపాధి పనుల మస్టర్లపై అధికారులు నిఘా ఉంచాలి



మంజేరులో ఉపాధి పనులను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: ఉపాధి పనుల మస్టర్లపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. గ్రామాల్లో ఫీల్డు అసిస్టెంట్లు, ఏపీఓలు కుమ్మక్కై కూలీల సంఖ్య పెంచి చూపుతూ దొంగ మస్టర్లు వేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలనలలో తమ దృష్టికి వచ్చిన అవకతవకలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ, కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వర్రే సుబ్బారావు, పినిపే సతీష్‌చంద్ర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌కు సత్కారం



వెలంపాలెంలో నాగరాజును సత్కరిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం గ్రామ సచివాలయాల మండల కన్వీనర్‌గా నియమితులైన వెలంపాలెం పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజును వెలంపాలెం సచివాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ అందేలా వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తానని అన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన చల్లా శ్రీనివాస్, పలివెల రాజేష్, పువ్వల నాగభూషణంలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, వార్డు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

48 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: స్థానిక మార్కెట్ సెంటరులో మోటారు సైకిల్‌పై మద్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అమలాపురం ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు మంగళవారం అరెస్ట్ చేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన కోలా వెంకట రత్నం పాండిచ్చేరి యానాం నుంచి సుజుకి యాక్సిస్ మోటారు సైకిల్‌పై 48 ఎన్‌డీపీ మద్యం సీసాలు అక్రమ రవాణా చేస్తుండగా ఎస్ఈబీ నిర్వహించిన దాడిలో పట్టుబడ్డాడు. అతని నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. నిందితుడిని ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్‌కు విధించారని సీఐ శివరామరాజు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఈబీ సిబ్బంది కరుణ, తాతారావు పాల్గొన్నారు.